www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 24 నవంబర్ 2025

నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ఈనెల 24వ తేదీన సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో 24వ తేదీ సోమవారం ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో కూడా వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చునని, అలాగే నమోదైన అర్జీల గురించి వాటి స్థితి దానికి సంబంధించి ఇన్ఫర్మేషన్ ఏమన్నా తెలుసుకోవాలి అన్నప్పుడు 1100కి నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్ సెల్..

చిత్తూరు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్' (ప్రజల ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం) 24వ తేదీ సోమవారం ఉదయం 10.30గంటలకు పాత డిపీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను పోలీస్ అధికారులకు నేరుగా తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 24వ తేదీ సోమవారం ఉదయం 10.30గంటలకు నగర పాలక సంస్థలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కర వేదికను సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ నరసింహ ప్రసాద్ కోరారు.

కుప్పంలో పిజిఆర్ఎస్

కుప్పం: కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం 24వ తేదిని పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కడ పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి అర్జీలు స్వీకరించనున్నట్లు పీడీ తెలిపారు. కుప్పం నియోజకవర్గ ప్రజలు ఏవైనా సమస్యలు ఉంటే అర్జీల రూపంలో తెలియజేస్తే వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

ఉపాధి బిల్లుల కోసం

శ్రామికుల నిరీక్షణ

- జిల్లాలో రూ.35.99కోట్లు మేర బకాయి బిల్లులు
- 100 రోజులుగా కూలి డబ్బు అందక ఇక్కట్లు..
- 50 వేల మంది కూలీల ఎదురుచూపులు

మండలంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి)

గ్రామీణ ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు 100 రోజులుగా వేతనాలు చెల్లింపులు నిలిచిపోయాయి. 15 రోజులు ఒకసారి విడుదల కావలసిన బిల్లులు మూడు నెలలుగా విడుదల కాకపోవడంతో చిత్తూరు జిల్లాలో ఉపాధి పనులకు హాజరయ్యే శ్రామికుల సంఖ్య గణనీయంగా తగ్గుతూ వస్తోంది. ఈ ఏడాది ఆగస్టు 15 తర్వాత చేసిన పనులకు ఉపాధి శ్రామికుల వేతనాలు చెల్లించలేదు. మూడు నెలలకు పైగా ఉపాధి హామీ చట్టంలో చేసిన పనులకు సంబంధించి దాదాపు చిత్తూరు జిల్లాలో 31 మండలాల్లో రూ.35.99 కోట్లను కూలీలకు చెల్లించాల్సి ఉన్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నాయి. సుమారు 50వేల మంది ఉపాధి కూలీలు బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు దొరకని రోజుల్లో పేదలు ఉపాధి హామీ పనులపైనే ఆధారపడుతుంటారు, వ్యవసాయ పనులు పూర్తిగా తగ్గిపోవడంతో నిరుపేద కూలీలు ఉపాధి పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు.

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ చట్టంకు 2025 ఆగస్టు 15వ తేదీ నుండి నిధులు విడుదల కాకపోవడంతో ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం ఉపాధి పనులు చేపట్టిన 15 రోజులు ఒక్కసారి ఉపాధి బిల్లులు చెల్లించాలని చట్టం చెబుతోంది. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా నిధులు విడుదలలో జాప్యం జరుగుతోంది, నిధులు విడుదల కాకపోవడంతో ఉపాధి కూలీలు చేసిన పనుల బిల్లుల కోసం నెలలు తరబడి వేసి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. కష్టపడి చేసిన పనికి రావల్సిన కూలీ డబ్బుల కోసం ఎదురుచూడాల్సి వస్తోందని వాపోతున్నారు.

అభివృద్ధి పనులు బకాయిలు రూ.65 కోట్లు

ఉపాధి హామీ చట్టం కింద గ్రామీణ ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలువలతోపాటు వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. వీటితోపాటు రైతులు మినీ గోకులం షెడ్లు నిర్మించుకుంటున్నారు. ఉపాధి వస్తు సామాగ్రి కింద చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు జిల్లాలో రూ.65కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి.

నెలల తరబడి ఎదురుచూస్తున్నాం..

- గీత, కొత్తూరు ఆది ఆంధ్రవాడ, యాదమరి

వంద రోజులు కష్టపడి పని చేసి మూడు నెలలుగా బిల్లుల కోసం ఎదురుచూస్తున్నాం. ఓటివారిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి హామీ చట్టం కింద మామిడి చెట్లకు కందకాలు పనులు మే నెలలో చేశాం. పనులు చేసి మూడు నెలలు అయ్యింది. ఇంతవరకు కూలీ డబ్బులు మా అకౌంట్లో జమ కాలేదు. డబ్బులు సకాలంలో రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

ఐదు వారాలు పనులు చేశాం..

- అంజలి, తాళ్లమడుగు, యాదమరి

ఉపాధి హామీ పనులు ఐదు వారాలపాటు మా గ్రామంలో చేశాం. ఐదు వారాలపాటు చేసిన ఉపాధి పనులకుగాను కూలీ డబ్బులు సుమారు రూ.10వేలు మాకు రావాల్సి ఉంది. 100 రోజులుగా బిల్లుల కోసం ఎదురు చూస్తున్నాం. ఆఫీసులో అడిగితే ఈరోజు, రేపు అని చెబుతున్నారు తప్ప కూలి డబ్బులు ఇవ్వడం లేదు. చేసిన పనులకు బిల్లులు సకాలంలో రాకపోవడంతో మహిళా సంఘంలో లోన్లు సకాలంలో కట్టలేకపోతున్నాం.

ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

- రవికుమార్, ఉపాధి హామీ పీడీ

జిల్లాలో ఉపాధి హామీ కూలీలకు చెల్లించాల్సిన బకాయిలు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే వారి వ్యక్తిగత ఖాతాలకు బిల్లులు చెల్లింపు జరుగుతుంది. ఉపాధి శ్రామికులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నిధులు విడుదల చేసిన వెంటనే వారి వారి వ్యక్తిగత ఖాతాల్లో బకాయి బిల్లుల మొత్తం జమ చేయడం జరుగుతుంది. ఉపాధి పనులు చేసిన కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించే విధంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటాం.

వెంటనే బకాయి బిల్లులు చెల్లించాలి

- వాడ గంగరాజు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు

జిల్లాలో 50వేల మందికి మూడు నెలలుగా ఉపాధి బిల్లులు ఇవ్వకపోవడం దారుణం. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి బిల్లు ఇవ్వకుండా కూలీలను నిలిచిపోయే విధంగా చేస్తున్నారు. పనులు చేయించుకుని బిల్లులు ఇవ్వకపోవడం చూస్తే పొమ్మనకుండా పొగబెట్టడం అన్న విధంగా ఉంది ప్రభుత్వాల తీరు. గ్రామీణప్రాంతాల్లో ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల్లో ఈ ఉపాధి హామీ వలన ఎంతోకొంత ఊరట లభించింది. అయితే పనులు చేయించుకుని నెలల తరబడి కూలి డబ్బులు ఇవ్వకపోవడం దారుణం. ఇప్పటికైనా బకాయి ఉన్న రూ.40 కోట్లు వెంటనే చెల్లించాలి.

ముగిసిన నారా భువనేశ్వరి కుప్పం పర్యటన

ప్రజాశక్తి- కుప్పం

సీఎం చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి నాలుగు రోజుల కుప్పం నియోజకవర్గ పర్యటన ముగించుకొని అమరావతికి ఆదివారం సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. ఈనెల 19 నుండి 23వ తేదీ వరకు నాలుగు రోజులపాటు నారా భువనేశ్వరి కుప్పం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. కుప్పం నియోజకవర్గ పర్యటన నిన్నటితో ముగియడంతో ఆదివారం శాంతిపురం మండలం శివపురం నివాసంలో నారా, నందమూరి కుటుంబ సభ్యులతో గడిపారు. ముఖ్యమంత్రి వారి స్వగృహంలో ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం, పీకేఎం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు ఘనంగా వీడ్కోలు పలికారు. సాయంత్రం కుప్పం నుంచి రోడ్డు మార్గాన బెంగళూరుకు వెళ్లి అక్కడ నుండి అమరావతి బయలుదేరి వెళ్లారు.

కుప్పం నుంచి బెంగళూరుకు బయలుదేరిన భువనేశ్వరి

తన పేరును చిన్నారికి పెట్టిన భువనేశ్వరి

కుప్పం నియోజకవర్గం పర్యటనలో భాగంగా నారా భువనేశ్వరి పలువురు చంటి బిడ్డలకు నామకరణం చేశారు. అయితే టిడిపి నేత సతీష్ రెండవ కుమార్తె నారా భువనేశ్వరి జన్మ నక్షత్రంలో జన్మించడంతో చంటి బిడ్డకు భువనేశ్వరి అని తన పేరుని నామకరణం చేశారు. భువనేశ్వరి తమ బిడ్డకు నామకరణం చేయడంతో సతీష్ కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి : సిఐటియు

నిరసన తెలుపుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు గిరిధర్ గుప్తా

ప్రజాశక్తి- పలమనేరు: కార్మికులకు, ఉద్యోగులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని సిఐటియు చిత్తూరు జిల్లా అధ్యక్షుడు గిరిధర్ గుప్తా డిమాండ్ చేశారు. ఆదివారం పలమనేరు సిఐటియు కార్యాలయం వద్ద కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ కాపీలను దగ్ధం చేసి నిరసన తెలిపారు. గిరిధర్ గుప్తా మాట్లాతూ గత ఐదేళ్లుగా ఈ చట్టాలను నిర్వీర్యం చేయాలని మోడీ ప్రభుత్వం చూస్తోందని, అప్పటినుంచి కార్మికుల ఆగ్రహజ్వాలలకు భయపడుతూ వెనకడుగు వేస్తూ వచ్చిందన్నారు. నేడు బీహార్‌లో ఎన్డీఏ కూటమికి అత్యధిక మెజారిటీ రావడంతో కేంద్రంలో కార్పొరేట్ అనుకూల విధానాల అమలు వేగవంతమైందని, దానిలో భాగంగానే 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటిస్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను అమల్లోకి తెస్తూ శుక్రవారం కేంద్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తుచేశారు. 2020లో పార్లమెంట్ ఆమోదించిన కార్మిక చట్టాల ఈ నిర్ణయాన్ని జాతీయ కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయని, ఈ కోడ్‌లు అమల్లోకి వస్తే కార్మికులు సమ్మె హక్కుతోపాటు అనేక ప్రయోజనాలను కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ సంస్థలకు చౌకగా శ్రమశక్తిని అందించడం, వారు మరిన్ని ఆర్థిక లాభాలను గడించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను అమల్లోకి తెచ్చిందని జాతీయ కార్మిక సంఘాలు తీవ్రంగా విమర్శిస్తున్నాయని, ఈ కోడ్‌ల అమలు వల్ల కార్మికుల పని గంటలు పెరుగుతాయని, అసంఘటిత రంగ కార్మికులకు చట్టపరిధిలో లభించే హక్కులు హరించబడతాయన్నారు. సిఐటియు నాయకులు రాజా, జయంతి, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి అంజి, శ్రీరామయ్య, సుధాకర్, ధనమ్మ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు తీర్థం విద్యార్థినులు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని తీర్థం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు అండర్ 17 రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీపతి తెలిపారు. బంగారుపాళ్యం మండలం మంగళపల్లిలో జరిగిని జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన తీర్థం విద్యార్థినులు 10వ తరగతి చదువుతున్న కావేరీ, 9వ తరగతి చదువుతున్న ప్రత్యూష రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరు ఈనెల 23, 24, 25 తేదీల్లో విజయనగరంలో నిర్వహించే 69వ స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను వ్యాయామ ఉపాధ్యాయుడు, చైర్మన్ మోహన్ తదితరులు అభినందించారు.

టీటీడీ నిత్యాన్నదానంకు

13 టన్నుల కూరగాయలు వితరణ

ప్రజాశక్తి- పలమనేరు: తిరుమల టీటీడీ నిత్యాన్నదాన సత్రానికి పలమనేరు నుంచి పలువురు దాతలు ఆదివారం 13 టన్నుల కూరగాయలను వితరణగా అందజేశారు. శ్రీవారి సేవకులు రవీంద్రారెడ్డి మిత్రబృందం ఆధ్వర్యంలో పలువురు మండి యజమానులు, దాతలు సుమారు 13 టన్నులు కూరగాయలు పలమనేరు మార్కెట్ నుంచి పంపించారు. పలమనేరు సీఐ మురళీమోహన్, ఎస్సై లోకేశ్ రెడ్డి, డాక్టర్ నాగమల్లేశ్వరి, చీరాల రాంబాబు, దాతలు పాల్గొన్నారు.

పలమనేరు బాలాజీకి జెవివి సాహితీ పురస్కారం

ఘనంగా చెకుముకి సైన్సు సంబరాలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

చిత్తూరు నగరంలోని ఓ ప్రైవేటు విద్యాసంస్థలో ఆదివారం జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు అరుణ శివప్రసాద్, యుగంధర్ బాబు పాల్గొన్నారు. ఈసందర్భంగా రచయిత, కవి, పెద్దపంజాణి ఎంపీడీవో, రాష్ట్ర తెలుగు భాషా పురస్కార గ్రహీత పలమనేరు బాలాజీకి జన విజ్ఞానవేదిక సాహితీ పురస్కారాన్ని అందించారు. కవి, కథా రచయిత, విమర్శకుడు, నవలాకారుడిగా నాలుగు ప్రక్రియల్లో రచనల ద్వారా తెలుగు సాహిత్య రంగంలో కృషి చేయడమే కాకుండా జిల్లా స్థాయిలో రాష్ట్రస్థాయిలో సాహిత్య కార్యక్రమాల నిర్వహణ ద్వారా యువ రచయితలను కవులను ప్రోత్సహిస్తూ అనేకవిధాల సాహిత్య సేవ చేస్తున్నారని కొనియాడారు. అలాగే అనేక అంతర్జాతీయ జాతీయ స్థాయిలో అనేక ప్రతిష్టాత్మక పురస్కారాల ద్వారా రాయలసీమ సాహిత్యానికి మంచిపేరు తీసుకువచ్చారని, రైతు సమస్యలను, మానవ సంబంధాలను, సున్నితమైన బాలలు, మహిళల సమస్యలను, కౌండిన్య అభయారణ్యంలో ఏనుగుల సమస్యలను తన రచనల్లో కళ్లకు కట్టినట్టుగా చిత్రిస్తారని పలమనేరు బాలాజీని వక్తలు అభినందించారు. కార్యక్రమంలో జెవివి నాయకులు సుదర్శనా చారి, జయంతి, ఆర్కే మోడల్ స్కూల్ కరస్పాండెంట్ కోమల రవీంద్ర పాల్గొన్నారు.

ఇటుక బట్టీలో వెట్టి చాకిరి

- గుడిపాల మండలంలో దారుణం
- రెండేళ్లుగా ఇటుకల బట్టీలోనే మూడు గిరిజన కుటుంబాలు
- వేలూరు కలెక్టర్‌ను కలిసిన సిపిఎం సభ్యులు
- యాజమాన్యంపై చర్య తీసుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి):

చిత్తూరు జిల్లా గుడిపాల మండలం గొల్లకండ్రిగ చిత్తూరు -వేలూరు జాతీయ రహదారి అనుకుని ఉన్న ఇటుక బట్టీల్లో గత రెండు సంవత్సరాలుగా తమిళనాడు రాష్ట్రానికి చెందిన గిరిజన కుటుంబాలతో 18 సంవత్సరాలు వయసు నిండని వారి పిల్లలతో ఇటుక బట్టీల్లో వెట్టి చాకిరీలో మగ్గుతున్నారు. ఈ విషయంపై శనివారం వేలూరు జిల్లా కలెక్టర్‌కు బాధిత కుటుంబ బంధువులు, సిపిఎం వేలూరు జిల్లా సభ్యులు వేలూరు కలెక్టర్ దృష్టికి సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. వెంటనే స్పందించిన వేలూరు జిల్లా కలెక్టర్ సుబ్బలక్ష్మి చిత్తూరు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలకు తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా గుడియాత్తం తాలూకాకు చెందిన తిరుభాస్కర్ కుటుంబం, కెవి.గుప్పం తాలూకాకు చెందిన కార్తీక్ కుటుంబం, సుబ్రహ్మణ్యం మూడు గిరిజన కుటుంబాలకు ఇటుక బట్టీలలో వెట్టి చాకిరి నుండి విముక్తి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు సమాచారం అందించారు. అంతర్ రాష్ట్ర రహదారి చిత్తూరు -వేలూరు ఆనుకొని ఇటుక బట్టిని నడుపుతూ బాలకార్మికుల దగ్గర రెండు సంవత్సరాలుగా పెట్టి చాకిరి చేయించుకుంటున్న యజమానిపై చర్యలు తీసుకుని బాధితులను స్వస్థలానికి చేర్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు.

యజమానిపై చర్యలు తీసుకోవాలి: సిపిఎం

తమిళనాడు -చిత్తూరు జిల్లా సరిహద్దుల్లో చెక్పోస్ట్ వద్ద తమిళనాడు గిరిజన కూలీలను గత రెండు సంవత్సరాలుగా బంధించి పనిచేయించుకుంటూ ఇబ్బంది పెడుతున్న ఇటుకల బట్టి యాజమాన్యంపై చర్య తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల కార్మికులకు విముక్తి కలిగించాలని కాట్పాడి సిపిఎం ఆధ్వర్యంలో వేలూరు జిల్లా కలెక్టర్‌ని కలిసి వినతిపత్రం ఇవ్వగా చిత్తూరు జిల్లా కలెక్టర్‌కి లెటర్ పంపారని తెలిపారు. ఈ విషయాన్ని చిత్తూరు జిల్లా కలెక్టర్ దృష్టికి సిపిఎం తీసుకెళ్లిందని, అలాగే జిల్లా లేబర్ అధికారులకు కూడా విషయం తెలియజేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం అనేక రకాలుగా బాలకార్మిక వ్యవస్థను నిషేధించాలని అన్ని రకాలుగా ప్రయత్నాలు జరుగుతున్న కొంతమంది ప్రభుత్వ లక్ష్యం నీరుగారుస్తూ ఇలా చేయించడం దారుణమన్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం బాలకార్మికులకు విముక్తి కలిగించి వారి స్వస్థలమైన తమిళనాడుకు పంపించే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సత్య సాయిబాబా స్ఫూర్తితో సేవాభావం అలవరచుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: భగవాన్ శ్రీసత్య సాయిబాబా సేవలు విశ్వవ్యాప్తమని, వారి సందేశాలు కోట్లాదిమంది భక్తుల హృదయాల్లో సంక్షిప్తమై ఉన్నాయని కలెక్టర్ సుమిత్ కుమార్ సత్యసాయిబాబా సేవలను కొనియాడారు. ఆదివారం ఉదయం కలెక్టరేట్ వివేకానంద ప్రాంగణంలో భగవాన్ శ్రీసత్యసాయిబాబా శత జయంతి వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి, చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ భగవాన్ సత్యసాయిబాబా జయంతిని రాష్ట్రపండుగగా రాష్ట్రప్రభుత్వం ప్రకటించిందని, రాష్ట్రమంతా పండుగవాతావరణంలో వేడుకలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సత్యసాయిబాబా తన సేవలతో మారుమూల గ్రామమైన పుట్టపర్తికి ప్రపంచస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చారని, రాయలసీమ ప్రజల దాహార్తి తీర్చి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. పేదలకు ఉచితవిద్య, అత్యాధునిక వైద్యరంగాల్లో బాబా సేవలు విశ్వవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయన్నారు. చుడా చైర్మన్ కఠారి హేమలత, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ పాల్గొన్నారు.

నివాళి అర్పిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

వీకోట : మండల కేంద్రమైన వి కోటలోని శ్రీ సత్యసాయి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీ సత్యసాయి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 2005 - 6 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు, సాయి భక్తుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్ పంచిపెట్టారు. అనంతరం ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల విశ్రాంత మండల విద్యాశాఖ అధికారి ఆర్ముగం పాల్గొన్నారు.

పలమనేరు: స్థానిక మున్సిపల్ కేంద్రంలో మున్సిపల్ కమిషనర్ ఎన్‌వి.రమణారెడ్డి ఆధ్వర్యంలో సత్య సాయి బాబా శత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ శ్రీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను నిర్మించి పేదలకు ఉచిత సేవలందించడం గొప్పవిషయమన్నారు. మున్సిపల్ మేనేజర్ ఖాదర్ మొహిద్దీన్, కౌన్సిలర్ కిరణ్ కుమార్, కుమార్ శెట్టి, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి డెవలప్మెంట్ సభ్యులు నాగరాజు, భాజాపీర్, శ్రీపురం సీతారామయ్య పాల్గొన్నారు.

విజయపురం (నగరి): సత్యసాయి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం టీఆర్ కండ్రిగ వద్ద గల శిరిడీస్ దివ్యాంగుల పాఠశాలలో షిరిడిసాయి సేవా కేంద్రం కన్వీనర్ లాయర్ మురళీధర్ దివ్యాంగులకు అన్నదానం చేశారు. షిరిడిసాయి సేవా కేంద్రం సభ్యులు, శిరీడ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

వినాయకుని సేవలో ఎమ్మెల్సీ శ్రీనివాసులు

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి) : ఉపాధ్యాయ సంఘాల ఎమ్మెల్సీ గాద శ్రీనివాసులు నాయుడు ఆదివారం చిత్తూరు జిల్లాకి విచ్చేసి కాణిపాక వినాయకస్వామిని, అర్ధగిరి శ్రీఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. కాణిపాక ఆలయంలో ఆలయాధికారులు దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటం అందించి వేదపండితులు ఆశీర్వదించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ వినాయక స్వామివారి దర్శించుకోవడం సంతోషకారంగా ఉందన్నారు. పిఆర్‌టియు జిల్లా ప్రధానకార్యదర్శి ఎ.విజయ భాస్కర్‌రెడ్డి, రాష్ట్రవైస్ ప్రెసిడెంట్ కె.కనకాచారి, జిల్లా నాయకులు రాజేష్, దేవంద్ర ఎమ్మెల్సీని సత్కరించారు.

ప్రారంభానికే పరిమితమైన సచివాలయం

నిరుపయోగంగా ఉన్న గ్రామ సచివాలయం

ప్రజాశక్తి - రొంపిచెర్ల: రొంపిచెర్ల గ్రామపంచాయతీలోని సచివాలయం ప్రారంభానికే పరిమితం అయ్యింది. ఐదేళ్ల క్రితం అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రొంపిచెర్ల -3 గ్రామ సచివాలయానికి ప్రభుత్వం నుంచి రూ.40 లక్షల నిధులను మంజూరు చేయించారు. దీంతో అధికారులు టెండర్లు నిర్వహించి పనులు పూర్తి చేశారు. అప్పట్లోనే మంత్రి చేతుల మీదుగానే సచివాలయాన్ని ప్రారంభించారు. అయితే ఐదేళ్లు అవుతున్న ఇంత వరకు ప్రజలకు సేవలు మాత్రం అందడం లేదు. దీంతో బోడిపాటివారిపల్లె, రొంపిచెర్ల గ్రామపంచాయతీలలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు తగు చర్యలు తీసుకొని గ్రామ సచివాలయాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

కాలువలను నిర్మించండి..

పేరుకుపోయిన మురుగు

ప్రజాశక్తి - రొంపిచెర్ల : రొంపిచెర్ల గ్రామపంచాయతీ, ఇందిరమ్మ కాలనీలో మురుగునీటి కాలువలను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఇందిరమ్మ కాలనీలో గత 15 సంవత్సరాల క్రితం ఇల్లు నిర్మించుకున్నారు, సీసీ రోడ్లు కూడా వేశారని తెలిపారు. అయితే పూర్తిస్థాయిలో మురుగునీటి కాలువలను నిర్మించలేదని దీంతో మురుగు మొత్తం రోడ్లపై ప్రవహిస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు వెళ్లే మార్గం లేక నిలిచిపోవడంతో దోమలు అభివృద్ధి చెంది విషజ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు తగు చర్యలు తీసుకొని ఇందిరమ్మ కాలనీలో మురుగునీటి కాలువలను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

తాగునీటికి అవస్థలు

అర్ధరాత్రి నీటిని వదులుతున్న వైనం

ఇబ్బంది పడుతున్న మహిళలు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని ఇందిరమ్మ కాలనీలో తాగునీటి సమస్యతో స్థానికులు సతమతమవుతున్నారు. రోజూ రాత్రి 10 నుంచి 11 గంటల మధ్య నీటిని వదులుతున్నారని, నీటికోసం మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోతున్నారు. రోజువారి పనులు చేసుకుని జీవించే తమకు రాత్రి సమయంలో విశ్రాంతి తీసుకోవడానికి కూడా లేదని, ఎప్పుడు తాగునీటి వదులుతారోనని రాత్రిళ్లు ఎదురుచూసి నీళ్లు తెచ్చుకోవల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు పగటి పూల నీటిని వదలాలని కోరినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సమస్యను పరిష్కరించాలని టిడిపి అధ్యక్షులు కిషోర్‌కు కాలనీవాసులు తెలిపారు. ఆయన అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

నేటి నుంచి రైతన్న మీకోసం వారోత్సవాలు

ప్రజాశక్తి- సోమల: మండలంలోని 9 క్లస్టర్ల పరిధిలో ఈనెల 24 నుంచి 29వ తేదీ వరకు రైతు సేవా కేంద్రాల వద్ద రైతన్న మీకోసం వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ తెలిపారు. రైతన్న మీకోసం వారోత్సవాలలో వ్యవసాయ, ఉద్యాన శాఖ, పట్టు పరిశ్రమ, మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొంటారని నంజంపేట, సోమల, ఇరికిపెంట, కందూరు, నెల్లిమంద, పెద్ద ఉప్పరపల్లి, ఎస్ నడింపల్లి, వల్లిగట్ల, 81 చిన్న ఉప్పరపల్లి పంచాయతీల పరిధిలో రైతు సేవా కేంద్రాల వద్ద రైతు సేవా కేంద్ర అధికారుల ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల గురించి తెలిపి రైతు అవసరాలను గుర్తించడం మేలైన యాజమాన్య పద్ధతులపై వారికి తెలియజేయడం జరుగుతుందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతుల కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొని అధికారుల సలహాలు సూచనలు తెలుసుకొని వారికి అవసరమైన యాజమాన్య పద్ధతులపై అధికారులను అడిగి సందేహాలను నివృత్తి చేసుకొని రైతన్నా మీకోసం వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేయూత

చెక్కును అందిస్తున్న నారా భువనేశ్వరి

ప్రజాశక్తి- కుప్పం: కుప్పం నియోజకవర్గ పరిధిలోని చిరు వ్యాపారులు, మహిళలకు ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నారా భువనేశ్వరి తోపుడు బండ్లు, కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. ఇప్పటికే పలుదపాలుగా చిరు వ్యాపారులకు ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తోపుడు బండ్లు అందివ్వగా తాజాగా 30 మంది చిరు వ్యాపారులకు తోపుడు బండ్లను అందజేశారు. అదేవిధంగా మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. మహిళలు, చిరువ్యాపారులకు ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా చేయూతనిస్తూ వారు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు కృషి చేస్తున్నట్లు నారా భువనేశ్వరి తెలిపారు. కార్యక్రమంలో వ్యాపారుల సంఘం అధ్యక్షులు ఎం.మంజునాథ్, చిరు వ్యాపారుల సభ్యులు పెరుమాళ్ స్వామి, బాబు, మతిన్, సురేష్, లాలు, కృష్ణ, గోపి, ప్రవీణ్, సుబ్రమణ్యం, చాన్ బాష, ప్రవీణ్, కార్తీక్, సురేష్ పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని తీర్థం గ్రామంలో మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. మెడికల్ చదువులు సామాన్యులకు అందుబాటులో ఉండాలని, ప్రైవేటీకరణ పేదలపై భారంగా మారుతుందని వారు పేర్కొన్నారు.

విశాఖ సిఇఎంఎస్‌తో తిరుపతి ఐఐటి ఎంఓయు

ప్రజాశక్తి-ఏర్పేడు: విశాఖపట్నంలోని ప్రముఖ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైం అండ్ షిప్ బిల్డింగ్ (సిఇఎంఎస్) తో తిరుపతి ఐఐటి ఎంఓయు చేసుకుంది. ఈ ఒప్పంద పత్రాలపై ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కెఎన్ సత్యనారాయణ, సిఇఎంఎస్ సంస్థ సీఈవో గోపికష్ణ శివమ్ సంతకాలు చేశారు. ఈ సంస్థలు పరిశ్రమ, అకాడేమియా సహకారాన్ని బలోపేతం చేయడానికి అధునాతన మాన్యుఫాక్చరింగ్ అండ్ ఇండస్ట్రీ 4.0 సాంకేతిక పరిజ్ఞానాలలో అత్యాధునిక శిక్షణ, నైపుణ్య కార్యక్రమాలను సంయుక్తంగా అభివద్ధి చేయడం, అందించడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఐఐటి డీన్ అరుణ్ తంగిరాల, డా.సాయి కష్ణ, అసోసియేట్ ప్రొఫెసర్, డా. సబ్యసాచి మజుందార్ పాల్గొన్నారు.

50 ఏళ్ల తర్వాత

పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనం

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

ప్రజాశక్తి- సోమల (సదుం): మండల కేంద్రమైన సదుం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1975-76 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం 50 ఏళ్ల తర్వాత సదుం సమీపంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఆనాడు పదవ తరగతి చదువుతూ తాము చేసిన అల్లరి చేష్టలు నాటి మధురమృతులను ఒకరినొకరు గుర్తు చేసుకుంటూ ఆనందోత్సాహాల మధ్య స్నేహితులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

నగరి సీఐగా మల్లికార్జున రావు

ఉద్యోగ బాధ్యతలు చేపడుతున్న సిఐ మల్లికార్జున రావు

ప్రజాశక్తి- విజయపురం (నగరి): నగరి సీఐగా మల్లికార్జునరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ గతంలో సీఐగా బాధ్యతలు నిర్వహించిన విక్రమ్ తిరుపతి స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీపై వెళ్లడంతో తిరుపతి ఇంటలిజెన్స్ విభాగంలో విధులు నిర్వహించిన మల్లికార్జున రావు బదిలీపై నగరికి వచ్చారు. నూతన సీఐ మాట్లాడుతూ నగరిలో శాంతిభద్రతల పరిరక్షణలో ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు.

వికలాంగులు, వృద్ధుల సహాయ పరికరాల గుర్తింపు

శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- సోమల (సదుం): మండల కేంద్రమైన సదుం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన వికలాంగులు, వృద్ధులు సహాయ పరికరాల గుర్తింపు శిబిరానికి విశేష స్పందన లభించింది. పలమనేరు ఆర్‌డిఓ భవాని, సంక్షేమ శాఖ అధికారులు, నియోజకవర్గ మండలస్థాయి అధికారులు సచివాలయ సిబ్బంది శిబిరంలో పాల్గొని శిబిరానికి వచ్చిన ప్రత్యేక ప్రతిభావంతులు వృద్ధులకు అవసరమైన పరికరాలను వివరాలతో పాటు నమోదు చేసుకొని ఆన్‌లైన్ చేశారు. మొత్తం శిబిరానికి 1056 మంది హాజరు కాగా ఆయా మండలాలకు సంబంధించిన సచివాలయ సిబ్బంది వారి మండలం నుండి వచ్చిన వారి వివరాలను నమోదు చేశారు. పరికరాల గుర్తింపు శిబిరం వల్ల తమకు ఎంతో ఉపయోగం కలిగిందని ప్రభుత్వం ఉచితంగా తమకు పరికరాలను అందజేయడం కోసం నమోదు ప్రక్రియ చేసుకోవడం సంతోషం కలిగిందని పలువురు అనుకోవడం కనిపించింది. ఆర్డీవో భవాని మాట్లాడుతూ శిబిరానికి వచ్చిన వారు వారి వివరాలను నమోదు చేసుకుని వారికి ఏ పరికరం అవసరమో తెలియజేశారని త్వరలో పరికరాలను వారికి అందించేందుకు సమయము తేదీ తెలియజేస్తామని ప్రభుత్వం ఉచితంగా అందజేసిన పరికరాలను వృద్ధులు వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా శిబిరం వద్ద వీల్ చైర్స్ ఏర్పాటు చేయడంతో నడవలేని వారిని ఎన్సిసి విద్యార్థులు వీల్‌చైర్ ద్వారా శిబిరానికి తరలించడం కనిపించింది.

ప్రజాసేవలో పలమనేరు ఫైర్ స్టేషన్

ఫైర్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టిన నరేష్

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు అగ్నిమాపక కేంద్రంలో నూతన ఫైర్‌స్టేషన్ ఆఫీసర్‌గా ఎం.నరేష్ బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పలమనేరు నియోజకవర్గంలో పలమనేరు అర్బన్, రూరల్, వీకోట, బైరెడ్డిపల్లి, గంగవరం, పెద్దపంజానిణి ఐదు మండలాల ప్రజలు పలమనేరు అగ్నిమాపక సిబ్బంది సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజాసేవలో తమ ఫైర్ స్టేషన్ సిబ్బంది ఎల్లవేళాలా ముందుంటామని తెలిపారు. ఏదైనా అనుకోని ప్రకృతి విపత్తులు, అగ్ని ప్రమాదాలు, సంఘటనలున జరిగినప్పుడు వెంటనే ఎమర్జెన్సీ నెంబర్ 101కు ఫోన్ చేసినట్లయితే తమ రెస్క్యూ సిబ్బంది అప్రమత్తమై తగు సహాయచర్యలు చేయడానికి సిద్ధంగా ఉంటారని తెలిపారు. అలాగే ప్రమాదాలను గుర్తించిన వెంటనే 101 నంబర్‌కు తెలియచేసినట్లయితే ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా నివారించగలుగుతామని తెలిపారు.

వర్షాకాలంలో జాగ్రత్తలు పాటించాలి

ప్రస్తుతం వర్షాలు పుష్కలంగా పడుతున్న నేపథ్యంలో చెరువులు, వాగులు, కుంటలు నీటితో పూర్తిగా నిండి ఉధృత్తంగా ప్రవహిస్తున్నాయని, పరవళ్లు తొక్కుతున్నాయని కనుక ప్రజలు వాగులు దాటేటపుడు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. అలాగే విద్యార్థులు, యువత ఈత సరదాతో చెరువులు, కుంటల వద్ద అనుకోని ప్రమాదాల వలన ప్రాణాలు కోల్పోతున్నారని తల్లిదండ్రులు తగిన జాగ్రతలు తీసుకోవాలన్నారు. భారీ వరద ప్రవాహంలో గల్లంతు అయిన వారిని కాపాడేందుకు గజ ఈతగాళ్లను పెట్టి సేవలు ముమ్మరం చేస్తున్నామని, భవనాలను అత్యాధునిక టెక్నాలజీతో నిర్మించినా సరే ఏదైనా ప్రమాదం సంభవిస్తే చాలు వాటిని బద్దలు కొట్టే సామర్థం గల పరికరాలను సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. నియోజకవర్గంలోని 5మండలాలకు ఒకే ఫైర్ స్టేషన్ ఉందని, ఏ ప్రమాదం సంభవించినా 101కి కాల్ చేయాలని కోరారు.

'బాలాజీ' రైల్వే డివిజన్‌పై 'పట్టు'

అవసరమైతే 'బంద్' సైతం

బాలాజీ రైల్వే డివిజన్ కోసం తిరుపతి ఎంపి ని కలిసిన కమిటీ నేతలు (ఫైల్)

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి బాలాజీ జిల్లా రైల్వే డివిజన్ ఉద్యమం రోజురోజుకూ ఊపందుకుంటోంది.సాధన సమితి కన్వీనర్ కుప్పల గిరిధర్ కుమార్ ఆధ్వర్యంలో ఇప్పటికే ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉండే ఎంఎల్ఎలను, ఎంపిలను, డిప్యూటీ సిఎంను కలిసి వినతిపత్రాలు ఇచ్చారు. బాలాజీ రైల్వే డివిజన్ అవసరం గురించి వివరించారు. అవసరమైతే 'బంద్'కు సైతం వెనుకాడబోమనేలా సాధన సమితి కార్యాచరణ ఉంది. తిరుపతి నగరంలో నాలుగు సార్లు మేధావులతో సమావేశం జరిగింది. రానున్న శీతాకాల పార్లమెంట్, అసెంబ్లీ సమావేశాల్లో తిరుపతి బాలాజీ రైల్వే డివిజన్ గురించి ప్రశ్నించే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి బాలాజీ డివిజన్ పై పార్లమెంట్లో మాట్లాడతామని హామీ ఇచ్చారు. ఇటు అసెంబ్లీలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తో పాటు, తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, నగిరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ కూడా అసెంబ్లీలో ప్రస్తావిస్తామని చెప్పారు. అలాగే శాసనమండలి సమావేశాల్లోనూ ప్రస్తావిస్తామని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం హామీ ఇచ్చారు. రైల్వే పరంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎంతో వెనుకబడి ఉంది. గత పది సంవత్సరాల కాలంలో బడ్జెట్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు రైల్వే పరంగా కేటాయింపులు అంతంత మాత్రంగానే ఉంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అపారమైన వనరులు ఉన్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సరిహద్దులుగా కర్నాటక, తమిళనాడు ఉన్నాయి. తూర్పున నెల్లూరు జిల్లాలో సముద్రం ఉండడంతో ఎంతో అనువుగా ఉంటుంది. తిరుపతి జిల్లాలో శ్రీసిటీలో వందలాది పరిశ్రమలు ఉన్నాయి. వేలాదిమంది కార్మికులు తమిళనాడు, ఆంధ్రనుంచి వచ్చి పని చేస్తుంటారు. రేణిగుంటలో రైల్వే క్యారేజ్ రిపేర్ షాప్‌లో దాదాపు 1500 పైగా మంది పని చేస్తారు. రేణిగుంటలో విమానాశ్రయం ఉంది. తిరుపతిలో అంతర్జాతీయ స్థాయిలో రైల్వే స్టేషన్ పనులు జరుగుతున్నాయి. తిరుపతి రైల్వే స్టేషన్ ఏడాదికి 250 కోట్ల రూపాయలు ఆదాయం సమకూరుస్తుంది. అలాగే రేణిగుంట రైల్వే స్టేషన్ ఏడాదికి 100 కోట్ల ఆదాయం రైల్వేకు వస్తోంది. తిరుపతితో పాటు చంద్రగిరి, రేణిగుంట రైల్వే స్టేషన్ ప్రజలకు అందుబాటులో ఉండడం వీటిని వీటిని అభివద్ధి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జాతీయ రహదారులు ఇరు రాష్ట్రాలకు అందుబాటులో ఉండడం ఓ వరం. తిరుపతి జిల్లా కొత్తగా ఏర్పడటం, తిరుపతి ఆధ్యాత్మిక ప్రాంతంగా ఉండడంతో ఇక్కడ యాత్రికుల సంఖ్య తాకిడి అధికంగానే ఉంటుంది. తిరుపతిలో రాయలసీమలో ఎక్కడా లేని విధంగా అనేక విద్య వైద్య కళాశాలలు అందుబాటులో ఉన్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉండే నిరుద్యోగులు ఉపాధి కోసం కర్నాటక, తమిళనాడు వెళ్లి ఉద్యోగాలు చేస్తుంటారు.

బాలాజీ డివిజన్తో ఉపయోగాలు

తిరుపతి బాలాజీ రైల్వే డివిజన్ వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని మేధావులు అంటున్నారు. ప్రతి ఏడాది రైల్వే బడ్జెట్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు అన్యాయం జరుగుతుంది. బాలాజీ రైల్వే డివిజన్ ఉంటే బడ్జెట్లో అనేక ప్రాజెక్టులు మంజూరు చేస్తారు. కొత్త రైళ్లు, కొత్త రైల్వే ట్రాకులు, విద్యుద్దీకరణ పనులు, రైల్వే ఆసుపత్రులు, విద్యాలయాలు వంటి ప్రాజెక్టులు మంజూరు అయితే వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుంది. ఈ ప్రాజెక్టుల వల్ల అనేకమంది ఉద్యోగాలు లభిస్తే వారు ఇక్కడ నివాసం ఉండడమే కాకుండా వారి పిల్లలు కూడా ఇక్కడే చదువుకొని ఉద్యోగాలు సంపాదించుకునే అవకాశం ఉంటుంది. డివిజన్ ఏర్పడడంతో ప్రయాణికులు సంఖ్య పెరగడమే కాకుండా రైల్వే ఆదాయం పెరిగే అవకాశాలు ఉన్నాయి. డివిజన్ ఉండడం వల్ల ఇటు చిత్తూరు జిల్లాతో పాటు అటు కడప, నెల్లూరు జిల్లా, అనంతపురం జిల్లా, ఇటు తమిళనాడు అటు కర్ణాటక లో నివసించే తెలుగు వాళ్లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. రానున్న పార్లమెంట్, అసెంబ్లీ సమావేశాల్లో బాలాజీ డివిజన్ పై ప్రశ్నించే అవకాశం ఉంది. డిసెంబర్ మొదటి వారంలో ఢిల్లీలో పలువురు ఎంపీలను, కేంద్ర మంత్రులను బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో కలవనున్నారు. అవసరమైతే తిరుపతి బంద్ నిర్వహిస్తామని మేధావులు అంటున్నారు

తిరుపతిలో ఫ్రెష్ టు ఫ్రెష్ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి మధ్యతరగతి కుటుంబాలకు గిట్టుబాటు ధరలను అందించడమే తమ లక్ష్యమని ఫ్రెష్ టు ఫ్రెష్ డీలర్ భరత్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బైరాగి పట్టణంలోని రెండవ సూపర్ మార్కెట్ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సూపర్ మార్కెట్ వ్యవస్థాపకులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది జూలై 12న ఎంఆర్ పల్లి సర్కిల్లో ప్రథమ సూపర్ మార్కెట్ ప్రారంభించామని తెలిపారు. తిరుపతిలో తమ సూపర్ మార్కెట్ ను ప్రజలు ఎంతగానో ఆదరిస్తున్నారని వారికి సౌకర్యార్థం రెండో షో రూమ్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. తిరుపతి ప్రజలకు చేరువలో మరో మూడో బ్రాంచ్ డిసెంబర్ నెలలో కరకంబాడి రోడ్డు లోని తిమ్మినాడు పాలెం వద్ద అతిపెద్ద సూపర్ మార్కెట్ను త్వరలో ప్రారంభించబోతున్నామని తెలియజేశారు.

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

రోడ్ద ప్రమాదంలో మృతిచెందిన వరలక్ష్మీ

ప్రజాశక్తి- వీకోట: పలమనేరు- వి కోట ప్రధాన రహదారిలోని చర్చి వద్ద ద్విచక్ర వాహనం, టిప్పర్ ఢీకొన్న సంఘటనలలో ఓ మహిళ మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వీకోట మండలం గాండ్లపల్లికి చెందిన మోహన్ భార్య వరలక్ష్మి (28) వీకోటలో బ్యూటీపార్లర్ నిర్వహిస్తోంది. ఆదివారం రాత్రి స్కూటీపై ఇంటికి వెళ్లే క్రమంలో రోడ్డు దాటుతుండగా అటుగా వెళుతున్న టిప్పర్ ఆమెను ఢీకొంది. దీంతో రోడ్డుపై పడి ఆమె తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు వీకోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతురాలికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. పోలీసులు రోడ్డు ప్రమాదంగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరుకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ సోమశేఖర్ రెడ్డి తెలిపారు.

బస్టాండ్‌లో వృద్ధుడు మృతి

బస్టాండ్ వద్ద వృద్ధుడి మృతదేహం

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం అర్ధరాత్రి ఓ వృద్ధుడు మరణించాడు. ఆదివారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసు విచారణలో మృతుడు గంగవరం మండలం, డ్రైవర్స్ కాలనీకి చెందిన గురువారెడ్డి (70)గా గుర్తించారు. గత కొన్ని రోజులుగా గురువారెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నట్లు, క్రమంలో ఆకస్మికంగా మృతి చెందినట్లు తెలుస్తోంది. పలమనేరు పోలీసులు సాధారణ మృతి కింద పరిగణించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సమస్యల పరిష్కారంలో సంఘం కీలకం

సమావేశంలో మాట్లాడుతున్న ఆనందబాబు

ప్రజాశక్తి-పలమనేరు: ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఏపీఎన్జీజీవో సంఘంలో తప్పనిసరిగా సభ్యులుగా చేరాలని ఆ సంఘం పలమనేరు తాలూకా అధ్యక్షుడు ఆనందబాబు కోరారు. సంఘంలో సభ్యత్వం ప్రతి ఉద్యోగికి అదనపు గౌరవాన్ని, భద్రతను ఇస్తుందని పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హోంలో వివిధ శాఖల ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఏపీ ఎన్జీజీవో సంఘం కీలకపాత్ర పోషిస్తోందని గుర్తుచేశారు. ప్రభుత్వం నుండి ఉద్యోగులకు అందాల్సిన అన్ని అంశాలపైన, హక్కుల సాధనపైన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏ.విద్యాసాగర్ నాయకత్వంలో నిరంతరం పోరాటం జరుగుతోందని, ఈపోరాటాలకు ఉద్యోగులందరి సహకారం, సంఘటితశక్తి అవసరమన్నారు. సంఘ కార్యదర్శి జయమ్మ, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి యాదవ్, గ్రామ/వార్డు సచివాలయం ఉద్యోగుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరి, జిల్లా అధ్యక్షుడు రమణ, లక్ష్మీపతి, మోహన్, రాంప్రసాద్, శ్రీనివాసులు, బిందు పాల్గొన్నారు.

సూర్య, చంద్ర ప్రభ వాహనాలపై పద్మావతి దేవి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో ఆదివారం అమ్మవారు సూర్యప్రభ, చంద్ర ప్రభ వాహనాల పై ఊరేగారు. అశ్వాలు, వషభాలు, గజాలు ముందు కదులుతుండగా మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటాల నడుమ అమ్మవారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో భక్తులకు అభయమిచ్చారు. ఉదయం 8 నుండి 10 గంటల వరకు సూర్యప్రభ వాహనసేవ సాగింది. రాత్రి 7 నుంచి 9 గంటల మధ్య చంద్రప్రభ వాహన సేవ నిర్వహించారు. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పించి అమ్మవారిని సేవించుకున్నారు. ఈ వాహనసేవల్లో పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈఓ దేవరాజులు, ఆలయ అర్చకులు బాబు స్వామి, శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

పంచమీ తీర్థానికి పటిష్ట ఏర్పాట్లు

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన నవంబరు 25వ తేదీ మంగళవారం జరగనున్న పంచమీ తీర్థానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం టిటిడి పటిష్ట ఏర్పాట్లు చేపట్టింది. పంచమీ తీర్థం నిర్వహణకు అవసరమైన క్యూలైన్లు, బారీకేడ్లు, పద్మపుష్కరిణిలోనికి ప్రవేశ, నిష్క్రమణ గేట్లు, సూచిక బోర్డులు తదితర ఇంజినీరింగ్ పనులు పూర్తయ్యాయి.

భద్రతా ఏర్పాట్లు

తిరుచానూరుకు విచ్చేసే భక్తుల సౌకర్యార్థం టిటిడి భద్రత, నిఘా విభాగం పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ఇందులో భాగంగా టిటిడి భద్రతా సిబ్బంది 600 మంది, స్కౌట్స్ అండ్ గైడ్స్ 200, ఎన్.సి.సి.విద్యార్థులు 200, శ్రీవారి సేవకులు 900, పోలీస్ సిబ్బంది 1600 మందితో భద్రతా ఏర్పాట్లు చేపట్టింది.

అన్నప్రసాదం కౌంటర్లు

భక్తుల సౌకర్యార్థం దాదాపు 150 అన్నప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేశారు. తోళ్ళప్ప గార్డన్స్‌లో 50, ఎస్వీ హైస్కూల్ వద్ద -15, శ్రీ అయప్పస్వామివారి (నవజీవన్ ఆసుపత్రి)ఆలయం వద్ద - 45, పూడి ఏరియాలో - 25., గేట్ - 4లో ఎమర్జెన్సీ - 15 అన్నప్రసాదం కౌంటర్లలో పంపిణీ చేస్తారు. అదేవిధంగా క్యూలైన్లలోని భక్తులకు అవసరమైన తాగునీరు, అల్పాహారం, అన్నప్రసాదాలు, మజ్జిగ పంపిణీ చేస్తారు. పంచమి తీర్థంలో భక్తులకు సేవలందించేందుకు దాదాపు 900 మంది శ్రీవారి సేవకులు టిటిడిలోని వివిధ విభాగాలలో సేవలందిస్తారు.

ఎస్వీబీసీ ద్వారా ప్రత్యక్ష ప్రసారం

పద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పంచమీ తీర్థం కార్యక్రమాన్ని ఎస్వీబీసీ ద్వారా ప్రత్యక్ష ప్రసారం అందిస్తారు. పద్మపుష్కరిణిలో మధ్యాహ్నం 12.10 గంటలకు కుంభలగ్నంలో చక్రస్నానం కార్యక్రమాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. పంచమీ తీర్థం ప్రభావం రోజంతా ఉంటుందని, భక్తులు సంయమనంతో వ్యవహరించి పుణ్యస్నానాలు ఆచరించాలని టిటిడి విజ్ఞప్తి చేస్తుంది.

సైన్స్ సెంటర్‌లో 'చెకుముకి' సంబరాలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి రీజినల్ సైన్స్ సెంటర్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెకుముకి సంబరాలు ఘనంగా జరిగాయని నాయకులు రెడ్డెప్ప, రఫీ తెలిపారు. మండల స్థాయిలో విజేతలైన 54 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. 3డి షో, ప్లాంటోరియంను సందర్శించారు. జిల్లాస్థాయి పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో మొదటిస్థానంలో నిలిచిన విద్యార్థులు రాష్ట్రస్థాయి చెకుముకి సంబరాలలో పాల్గొంటారు. రాష్ట్రస్థాయి సంబరాలు డిసెంబర్ 21 నుంచి 23 వరకూ కాకినాడ జెఎన్‌టియు ఇంజినీరింగ్ కాలేజీలో జరుగుతాయి. జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొన్న 162 మంది విద్యార్థులకు మెమెంటో, మూడు సైన్స్ పుస్తకాలను బహూకరించారు. ముఖ్య అతిథులుగా స్విమ్స్ కార్డియాలజీ ప్రొఫెసర్ వనజాక్షమ్మ, సైన్స్ ఎంటర్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పురుషోత్తం, రిటైర్డ్ ప్రొఫెసర్ చలపతి, మణికంఠ, యుటిఎఫ్ నాయులు ఎస్ఎస్ నాయుడు, మధు, కిరణ్ స్కూల్ అధినేత జయరామిరెడ్డి, బాలోత్సవం నాయకులు దామోదరం, గురునాధం, ఫిజికల్ సైన్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు మోహన్‌బాబు పాల్గొన్నారు.

కళత్తూరు ముంపు బాధితులకు

వంట పాత్రలు పంపిణీ

ప్రజాశక్తి - కెవిబిపురం

కే వి బి పురం మండలంలోని కళత్తూరు ముంపు బాధితులకు రోటరీ క్లబ్ తిరుపతి, వేమన విజ్ఞాన కేంద్రం తిరుపతి వారు దాతల సహాయార్థంతో 55 కుటుంబాలకు వంట పాత్రలను శనివారం పంపిణీ చేశారు. దాదాపు లక్షన్నర రూపాయల విలువ చేసే వంట పాత్రలను కెవిబిపురం జడ్‌పి హైస్కూల్లో బాధితులకు ఇచ్చినట్లు ట్రస్టు కార్యదర్శి మల్లారపు నాగార్జున, రోటరీక్లబ్ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, బాలోత్సవం నాయకులు నడ్డినారాయణ, డాక్టర్ టి.రవీంద్రకుమార్ తెలిపారు. నవంబర్ ఆరో తేదీ కట్టతెగి సర్వస్వం కోల్పోయిన బాధిత దళితులకు తమ వంతు ఉడతాభక్తిగా సాయం చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్, నాయకులు నాగలాపురం నాగరాజు పాల్గొన్నారు.

IN THE COURT OF THE VI ADDL. JUNIOR CIVIL JUDGE OF CHITTOOR
O. S No. 9 of 2023

Between:
R. Giridharan ...Plaintiff
And:
S. Suhel and another ..Defendants

NOTICE TO DEFENDANTS

To
1. S.SUHEL S/O SYED SHABU,
aged about 32 years,
2. AFRIN W/O S. SUHEL,
aged about 29 years,
Both are residents of Door No. 28-785 K. N. Colony, Ganganapalli Road, Chittoor Town and District,
present residing at D. No. 29-965, Muradh Baba Darga, Thenabanda, Chittoor Town and District
Sir/Madam,

Please take notice that the above case is posted to **19.12.2025,** for your notice and appearance at **10.30** am, before the above said court. You may appear either in person or through an advocate and file your objection if any, failing which the matter will be decided exparte.

Sd/- **S.VIJAYA BHASKAR RAO**
Advocate for Plaintiff
Place:Chittoor, Date :22.11.2025